

27న ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

నర్సాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 27న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఏఅండ్‌టీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు గురుకుల కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని సూచించారు.

సండే స్పెషల్
Sunday Special

ఎద్దు బండి గిల్ల ఎగిరిపడ్డది!

కాడెడ్ల బండి వ్యవసాయానికి ఆధారం. గ్రామీణుల ప్రయాణ సాధనం. ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం కాడెడ్ల బండ్లు కనుమరుగయ్యాయి. ఇనుప చక్రాల తాకిడికి బండి గిల్ల ఎగిరిపడ్డది. కిర్రుకిర్రుమని శబ్దం చేసే చక్రాల బండి మూలనపడ్డది. ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోల రాకతో ఎడ్ల బండి కళ కోల్పోయింది. ట్రాక్టర్లు, యంత్రాలను ఉపయోగించడానికే రైతులు మొగ్గుచూపడంతో ఎడ్ల వినియోగం తగ్గిపోయింది. బండ్లు మూలనపడ్డాయి. అక్కడక్కడా ఇప్పటికీ బండ్లు వాడుతున్నా.. కర్రతో చేసిన బండ్లకు బదులు ఇనుముతో చేసిన బండ్లనే ఉపయోగిస్తున్నారు.

- పల్లెల్లో కనిపించని ఎడ్లబండ్లు..
- నాడు వ్యవసాయంలో కీలకం.. నేడు తగ్గిన వాడకం
- వాటి స్థానంలో ట్రాక్టర్లు.. ఆటో ట్రాలీలు

9లో



బండి చక్రాలకు మరమ్మతు చేస్తున్న వడ్రంగి



నిరుపయోగంగా మారిన ఎడ్లబండి ➤



అంబాజీపేటలో కొనుగోలు కేంద్రంలో వడ్లలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సంగారెడ్డి జీజీహెచ్‌లో ఆర్టీపీసీఆర్ ల్యాబ్ పునరుద్ధరణ

సంసిద్ధంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు

సంగారెడ్డి అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ కూకట్‌పల్లిలో కొవిడ్ కేసును గుర్తించడంతో సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ అధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్‌ను శనివారం పునరుద్ధరించారు. ఓ రిమాండ్ ఖైదీకి ర్యాపిడ్ టెస్టు నిర్వహించగా నెగిటివ్ వచ్చిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో కొవిడ్ కేసు నమోదు కావడంతో ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసే అవకాశం ఉందని, ఈమేరకు మాక్‌డ్రిల్ కూడా నిర్వహించవచ్చని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఈమేరకు ముందుజాగ్రత్తగా ఆక్సిజన్ నిల్వలు, మందుల నిల్వలను అధికారులు తనిఖీ చేశారు. ఆక్సిజన్-ఐసీయూ పడకలు, వెంటిలేటర్లు, ర్యాపిడ్‌యంటీజెన్, ఆర్టీపీసీఆర్ టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ ప్లాంట్లపై సమీక్ష నిర్వహించారు. అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది, అంబులెన్సుల పనితీరు, వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొవిడ్ కేసు నమోదైన నేపథ్యంలో డాక్టర్లు, సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. కొవిడ్ లక్షణాలతో వస్తే నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించామని పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

చెరువు నక్షా.. పక్కా

పటాన్‌చెరు నియోజకవర్గంలో 366 చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

- వెబ్‌సైట్‌లో చెరువు మ్యాప్..
- సర్వే నంబర్ల వివరాలు
- ఆక్రమణలకు అడ్డుకట్ట
- అచితూచి అనుమతులిస్తున్న అధికారులు
- నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులేనని ఉన్నతాధికారుల హెచ్చరికలు

రామచంద్రాపురం టౌన్ మే 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివార్లలో ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలో చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో 366 చెరువులను సర్వే చేసి వివరాలను నక్షాతో సహా హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో ఉంచారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం, నగర శివార్లలో ఉండటంతో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రణకు గురవుతున్నాయి. అక్రమార్కులు జల వనరులు సైతం వదలడం లేదు. విలువైన భూములు, జలాశయాలు అన్యాక్రాంతం కావడంపై గతంలో స్వచ్ఛంద సంస్థలు హైకోర్టులో కేసు వేయగా.. న్యాయస్థానం స్పందిస్తూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో, హెచ్‌ఎండీఏ అధికారులు.. రెవెన్యూ సిబ్బంది సహకారంతో నియోజకవర్గంలో చెరువుల ఎఫ్‌టీఎల్ గుర్తింపునకు సర్వేలు ప్రారంభించారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని 366 చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, ఈమేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచారు.



ముత్తంగి చెరువు

పరిశీలించిన తర్వాతే..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి సర్వేలోనూ ఆయా నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయేమో నిశితంగా పరిశీలిస్తున్నారు. తెల్లాపూర్, అమీన్‌పూర్, ఐడీఏబొల్లారం, ఇస్నాపూర్, గడ్డపోతారం పురపాలక సంఘాలతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్మాణాల అనుమతులు జారీచేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. చెరువులకు సమీపంలో ఉన్న కాలనీల్లో నిర్మాణాలకు నీటిపారుదలశాఖ ఎన్‌వోసీ తప్పనిసరి చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు సైతం ప్రత్యక్షంగా విచారించిన అనంతరమే నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌వోసీ జారీచేస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించినట్లు తెలుస్తోంది.

'రియల్' మోసాలకు చెక్

పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఐడీఏబొల్లారం, తెల్లాపూర్, ఇస్నాపూర్ ప్రాంతాల్లోని చెరువుల ఎఫ్‌టీఎల్‌లోనే ప్లాట్లు చేసి విక్రయించిన విషయం ఎల్‌ఆర్‌ఎస్ విచారణ జరుగుతున్న సమయంలో బయటపడుతున్నాయి. ఇకపై అటువంటి మోసాలకు గురవకుండా కొనుగోలుదారులు ఆయా స్థలాలను మ్యాప్‌ల ఆధారంగా పోల్చుకునే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ప్రతీ చెరువు మ్యాప్ వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తుండటంతో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న స్థలాలపై అప్రమత్తమయ్యే అవకాశం ఉంది. స్థలానికి దగ్గర్లో చెరువు ఉంటే.. సంబంధిత సర్వే నంబర్లను, చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తే సదరు స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా.. లేదా అనేది తెలిసిపోతుంది.

తడిసిన వడ్లనూ కొనుగోలు చేస్తాం

- జిల్లాలో 2.69లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- 120 సెంటర్లలో కొనుగోళ్లు పూర్తి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట మే 24 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. చిన్నశంకరంపేట, అంబాజీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రైతులతో మాట్లాడి, కొనుగోలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని వెల్లడించారు. ఇప్పటికే 120 కేంద్రాల్లో కొనుగోళ్ల పూర్తిచేశామని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈసారి 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేశామన్నారు. కేంద్రాల్లో ఉన్న వడ్లను వెంటనే తూకంవేసి రైస్‌మిల్లులకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోని మిల్లులకు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు తీసుకున్నామని తెలియజేశారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయని పేర్కొన్నారు.



సాగుకు సన్నద్ధం

- విత్తనాల ఎంపికే కీలకం
- నకిలీలతో జాగ్రత్త

9లో

వారి నిర్లక్ష్యం.. పంచాయతీ కార్మికుడికి ప్రాణగండం

- డబ్బు ఆశ చూపి కరెంట్ స్తంభంపైకి..
- అక్కడి నుంచి పడి వెన్నుకు గాయాలు
- ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో బాధితుడు

9లో



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీకి అనువైన కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేందుకు కృషిచేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల 14న జరగనున్న లోక్‌అదాలత్‌లో వీలైనన్ని కేసుల్లో దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. ఈమేరకు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. నేర విచారణ పకడ్బందీగా చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. దోషులకు శిక్ష పడితేనే తిరిగి నేరం చేయడానికి వెనుకడుగు వేస్తారని, ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. కోర్టు డ్యూటీ అధికారులు చార్జ్ షీట్ దాఖలు మొదలుకొని, తీర్పు వెలువడే వరకు బాధితులకు అండగా ఉండాలని సూచించారు. కేసులు పెండింగ్ లేకుండా శిక్ష పడేలా ఫిర్యాదుదారులు, సాక్షులను గైడ్ చేయాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

'సత్యసాయి' సేవలు అద్భుతం

- ఇదొక గొప్ప సేవామందిరం
- ఎంతోమంది పిల్లలకు జీవితాన్నిచ్చింది

ఇండియన్ బ్యాడ్మింటన్ చీఫ్ నేషనల్ కోచ్ పుల్లెల గోపీచంద్



సత్యసాయి సంస్థలో చికిత్స పొందిన చిన్నారులతో పుల్లెల గోపీచంద్

కొండపాక, మే 24 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సంస్థలు అందిస్తున్న సేవలు ఎంతో అద్భుతమైనవని ఇండియన్ బ్యాడ్మింటన్ చీఫ్ నేషనల్ కోచ్ పుల్లెల గోపీచంద్ పేర్కొన్నారు. కొండపాక ఆనందనిలయంలోని సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ రీసర్చ్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ ఆసుపత్రిలో ఈ నెల 13 నుంచి 23 వరకు నాలుగవ సెషన్లో 25 చిన్నారుల గుండె ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా గిఫ్ట్ ఆఫ్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపీచంద్ గుండె ఆపరేషన్ చేయించుకున్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిట్టి గుండెలకు ఆపరేషన్లు చేసి ఎంతోమంది చిన్నారులకు జీవితానివ్వడం గొప్ప విషయమన్నారు. మారుమూల ప్రాంతాల అభాగ్యులకు సైతం సత్యసాయి సేవలు అందడం వారి అదృష్టమన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 108 మంది పిల్లలకు విజయవంతంగా ఆపరేషన్లు చేసినట్లు సత్యసాయి సంజీవని హార్ట్‌సెంటర్‌లో గిఫ్ట్ ఆఫ్ లైఫ్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. ఇది సేవా మందిరమని ఇప్పటివరకు 108 మంది పిల్లలు జీవనదానం పొందారన్నారు. సంస్థ సేవలు విశ్వవ్యాప్తమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వరదరాజన్ కృష్ణన్, ఆసుపత్రి ప్రతినిధి జగనాథ్ శర్మ గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఆపరేషన్ అయిన ఒక పాప పుట్టినరోజు శనివారమే కావడంతో పిల్లలందరితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.

నాలుగు నెలలుగా వేతనాల్లేవ్

- 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ టీచర్ల ఎదురుచూపులు
- ట్రెజరీకి అందని ఆదేశాలు
- సంగారెడ్డి జిల్లాలో 67 మంది ఉపాధ్యాయులు
- కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన

సంగారెడ్డి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో వారంతా కాంట్రాక్ట్ టీచర్లుగా నియమితులైన 2008-డీఎస్సీ ఉద్యోగార్థులు. పదిహేడేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత 2008 డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించడంతో వారి కల సాకారమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఎస్జీటీలుగా నియామకపత్రాలు అందుకుని విధుల్లో చేరారు. ఉద్యోగాలు వచ్చాయనే సంతోషం ఎక్కువ రోజులు నిలువలేదు. నాలుగు నెలలైనా ప్రభుత్వం నుంచి వేతనాలు విడుదల కాలేదు. అధికారులతో మొరపెట్టుకున్నా.. ఆఫీసుల చుట్టూ తిరిగినా ఎదురుచూపులే దిక్కయ్యాయి.



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం

గౌరవ వేతనం దూరం

సంగారెడ్డి జిల్లాలో 2008 డీఎస్సీ అభ్యర్థులు 67 మంది కాంట్రాక్ట్ టీచర్లుగా నియమితులయ్యారు. వీరికి నెలకు రూ.31,040 చొప్పున గౌరవ వేతనం అందిస్తామని నియామకపత్రంలో పేర్కొన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు మాత్రం రాలేదు. ఉద్యోగంలో చేరామన్న ఆనందమే తప్పా నాలుగు నెలలుగా వేతనాలు అందక అప్పులు చేసి నెట్టుకొస్తున్నామని వారు వాపోతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులకూ వీరు హాజరవుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేని సమయంలో ప్రయాణచార్జీలు కూడా భారంగా మారాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు త్వరగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ టీచర్లు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ టీచర్ల వేతనాల చెల్లింపుపై జిల్లా ట్రెజరీ అధికారులకు ఉత్తర్వులు అందాల్సి ఉంది. అందుకే వేతనాల చెల్లింపులు ఆలస్యమవుతున్నట్టు మాకు సమాచారం ఉంది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో వేతనాలు విడుదలవుతాయి.

-ఎస్.వెంకటేశ్వర్లు, సంగారెడ్డి డీఈవో

కారును ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు


కారును పరిశీలిస్తున్న పోలీసులు

నారాయణఖేడ్, మే 24 (ఆంధ్రజ్యోతి) : బహుజన చైతన్య వేదిక సంస్థ వ్యవస్థాపకుడు, న్యాయవాది అలిగే జీవన్‌కుమార్‌కు సంబంధించిన కారును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మండల పరిధిలోని జూకల్‌లో శుక్రవారం జరిగిన ఓ వివాహానికి తన కారులో వెళ్లి హాజరయ్యారు. రాత్రి అక్కడే ఉన్న ఆయన ఖాళీ స్థలంలో పార్కు చేసి ఉంచారు. శనివారం ఉదయం కారు వద్దకెళ్లి చూడగా వెనక భాగంలో ఉన్న అద్దాలు ధ్వంసమై కనిపించాయి. ఈ మేరకు ఖేడ్ పోలీసులకు చేశారు.

తూప్రాన్‌లో ఎండు గంజాయి పట్టివేత


తూప్రాన్‌లో గంజాయి నిందితుడితో సీఐ, సిబ్బంది

తూప్రాన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో వాహన తనిఖీలో 41 ప్యాకెట్ల ఎండు గంజాయి పట్టుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపారు. ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ మెదక్ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం నర్సాపూర్ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఓ వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా.. 300 గ్రాముల 41 ప్యాకెట్ల ఎండు గంజాయి లభించినట్లు వివరించారు. అతడిని విచారించగా తూప్రాన్ పట్టణ పరిధి హైదర్‌గూడకు చెందిన బుర్ర జితేందర్‌గా గుర్తించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్లు గోపాల్ పేర్కొన్నారు. ఎస్ఐ బాలయ్య, కానిస్టేబుల్ ఎల్లయ్య, చంద్రయ్య, రాజు, రవి, నవీన్, నరేష్, హరీశ్ పాల్గొన్నారు.


పట్టుబడిన గంజాయి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


దాడ్ల ఆనంద్(ఫైల్)

పటాన్‌చెరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాటి గ్రామ శివారు గాడియమ్ స్కూల్ వద్ద చోటుచేసుకుంది. బీడీఎల్ పోలీసుల వివరాల ప్రకారం.. మెహిదీపట్నం కార్వాన్ ప్రాంతానికి చెందిన దాడ్ల ఆనంద్(23), సుదీప్‌కుమార్ నారాయణఖేడ్ సమీపంలో బోరంచ గ్రామంలో జరగనున్న జాతరకు వెళ్తున్నారు. పాటి సమీపంలో గాడియమ్ స్కూల్ వద్ద వెనక నుంచి ఆటోను ఢీకొని కిందపడగా ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పటాన్‌చెరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


కరుణాకర్

కొడకండ్లలో..

గజ్వేల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండలం కొడకండ్లలో చోటుచేసుకుంది. కొడకండ్ల గ్రామానికి చెందిన తలారి కరుణాకర్(30) శనివారం ఉదయం ఇంట్లో నుంచి కుకునూరుపల్లి మండల కేంద్రానికి మేస్త్రీ పని నిమిత్తం వెళ్లి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కరుణాకర్‌ను చుట్టుపక్కల వారు గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మనోహరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన బోల్లబోయిన లక్ష్మి, సురేందర్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు మహేష్‌యాదవ్(29) ఉన్నారు. కూతుళ్లకు పెళ్లిలు జరిగాయి. తల్లిదండ్రులు మహేష్‌యాదవ్‌తోకలిసి గ్రామంలో నివాసముంటున్నారు. శుక్రవారం తల్లి కూతుళ్ల వద్దకెళ్లి వచ్చేసరికి మహేష్ అప్పటికే ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేష్ మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతూ తల్లితో రోజూ గొడవపడేవాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

అధికంగా మద్యం సేవించి..

బెజ్జంకి, మే 24 (ఆంధ్రజ్యోతి) : తాగుడుకు బానిసై అధికంగా మద్యం సేవించిన వ్యక్తి మృతిచెందిన సంఘటన బెజ్జంకి మండల కేంద్రంలో శనివారం జరిగింది. మహారాష్ట్రలోని భీవండికి చెందిన కోడం అక్షయ్(30) నాలుగేళ్ల క్రితం ఉపాధి కోసం వచ్చి కూలి పనులు చేసుకుంటూ బెజ్జంకి అనుబంధ గ్రామమైన పాపన్నపల్లిలో నివాసముంటున్నాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగి తల్లిని తిడుతుండేవాడు. 15 రోజుల క్రితం తల్లి మందలించడంతో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి రాకుండా మద్యం తాగుతూ తిరుగుతుండేవాడు. మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలో అధికంగా మద్యం సేవించి అక్షయ్ శనివారం మృతిచెంది ఉన్నాడు. మృతుడి తల్లి కోడం భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి..

రాయపోల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాయపోల్ మండలం ఎల్కల్‌కు చెందిన జాల సుధాకర్(36) తన పొలంలో మూడు బోర్లు తవ్వించాడు. దీంతో రూ.2 లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది 20న పొలం వద్ద గడ్డి మందు తాగి ఇంటికొచ్చి భార్యకు చెప్పాడు. ఆమె ఆయనను వెంటనే గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సుధాకర్ శుక్రవారం సాయంత్రం వేరే ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


యాదగిరి(ఫైల్)

చేగుంట, మే 24 (ఆంధ్రజ్యోతి) : అవసరానికి అప్పు ఇవ్వగా.. వారు తిరిగి ఇవ్వకపోవడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నార్సింగి మండలం సంకాపూర్ గ్రామానికి చెందిన బైకరి యాదగిరి(42) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన దాయాది ఐలయ్యకు కొన్నేళ్ల క్రితం రూ.3.70 లక్షలు అవసరం నిమిత్తం ఇచ్చాడు. డబ్బులు ఇవ్వాలని పదేపదే ఐలయ్యను అడిగితే వాయిదాలు వేస్తూ వస్తున్నాడు. అప్పు ఎలా తీర్చాలని మనస్తాపం చెందిన యాదగిరి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు పోలీసులకు, కుటుంబీకులకు సమాచారమందించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకు,ఇ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు బన్ని, కూతురు దివ్య ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ మైనుద్దీన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రెండు వాహనాలు ఢీకొని, ఇద్దరికి గాయాలు

శివ్వంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన గోమారం శివారులో శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామానికి చెందిన పద్మారెడ్డి(30) శుక్రవారం సాయంత్రం బైకుపై గోమారం నుంచి సికింద్లాపూర్ వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో పిట్లలవాడకు చెందిన ఇంద్రేష్(50) టీవీఎస్ ఎక్సెల్‌పై గోమారం వైపు వస్తుండగా గోమారం శివారులోని శ్మశానవాటిక సమీపంలో రెండు వాహనాలు ఢీకొనడంతో ఘటనలో పద్మారెడ్డి కాలు విరిగింది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో లక్ష్మక్కపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

102 అంబులెన్స్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● ఏడురోజుల చిన్నారి, తల్లికి గాయాలు

అల్లాదుర్గం, మే 24 (ఆంధ్రజ్యోతి) : 102 అంబులెన్స్‌ను బస్సు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లకుంట గిరిజనతండా గ్రామపంచాయతీ పరిధిలోని కోమటికుంట గిరిజనతండాకు చెందిన జంకి బావి చామంతి జోగిపేటలోని ప్రభుత్వాసుపత్రిలో తన ఏడు రోజుల పాపతో వైద్య పరీక్షలు నిర్వహించేసుకొని 102 అంబులెన్స్‌లో స్వగ్రామానికి తిరిగి వస్తున్నారన్నారు. ఈ క్రమంలో చిల్వర్ గ్రామం వద్ద గల అండర్ బ్రిడ్జి వద్ద అల్లాదుర్గం వైపు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న సంగారెడ్డి ఆర్టీసీ డిపో అంబులెన్స్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో పాపతో పాటు తల్లి చామంతికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్ డ్రైవర్ గొరైకంటి ప్రతాప్‌గౌడ్ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

లారీ క్లీనర్ అదృశ్యం

చేగుంట, మే 24 (ఆంధ్రజ్యోతి) : లారీ క్లీనర్ అదృశ్యమైన సంఘటన నార్సింగి మండల పరిధిలోని వల్లూరు గ్రామ శివారులో చోటుచేసుకుంది. నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మైనుద్దీన్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా, సూదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుమ చిన్నరాయుడు(30) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు ఈనెల 17న రాయచూరు నుంచి బియ్యం లోడ్ చేసుకొని నాగపూర్‌కు డ్రైవర్ షేక్ కరిముల్లాతో కలిసి బయలుదేరాడు. 18న నార్సింగ్ మండలం వల్లూరు శివారులోని 44వ జాతీయ రహదారి వద్ద బహిర్భూమికి అని చెప్పి వెళ్లిన క్లీనర్ చిన్నరాయుడు ఎంతకీ రాకపోవడంతో డ్రైవర్ షేక్ కరీముల్లా కుటుంబసభ్యులకు ఫోన్‌చేశాడు. ఈ విషయమై కుటుంబసభ్యులు నార్సిగి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

బెజ్జంకి, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారిపై ఆర్టీసీ బస్సును లారీ వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ ఎలక్ట్రానిక్ బస్సు సుమారు 51 మంది ప్రయాణికులతో కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్తుంది. ముందు బెజ్జంకి క్రాసింగ్ స్టేజీ ఉండడంతో డ్రైవర్ బస్సును స్లో చేశాడు. ఈ క్రమంలో వెనకాల వస్తున్న లారీ డ్రైవర్ ఓవర్ టెక్ చేస్తూ ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఆర్టీసీ బస్సు వెనుక భాగం దెబ్బతింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.



పడియాల్‌తండాలో పనులు పరిశీలిస్తున్న కేంద్ర అధికారులు

ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం

జహీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): మొగుడంపల్లితోపాటు మండలంలోని పడియాల్‌తాండ తదితర గ్రామాల్లో శనివారం కేంద్ర బృందం అధికారులు పర్యటించారు. ఉపాధి పనుల నిర్వాహణ, కూలీల సమస్యలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను వారు కూలీలతో మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే, ఆయా ప్రాంతాల్లో చేపట్టిన, చేపట్టబోయే పనులను, నర్సరీలను వారు పరిశీలించారు. ఉపాధి పనులు బాగానే ఉన్నాయని కూలీలు కేంద్ర అధికారులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రెటరీ సంజయ్‌కుమార్, బృందం సభ్యులు పంకజ్ కుమార్ రానా, డీఆర్‌డీవో జ్యోతి, జిల్లా పరిషత్ సీఈవో జానకీరెడ్డి, డీపీవో సాయిబాబా, ఏపీడీ పూజ, ప్రత్యేక అధికారులు గోపాల్‌సింగ్, బాల్‌రాజ్, ఎంపీడీవో మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు పెంచాలి

కోహీర్, మే 24: (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్య పెంచేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డి అన్నారు. శనివారం కోహీర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఆయన ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామస్థాయిలోని ఆశా వర్కర్ల సమన్వయంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు అయ్యే విధంగా చూడాలన్నారు. వైద్య సిబ్బంది రోగుల పట్ల సకాలంలో స్పందించి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యం అందించినప్పుడే ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు వెళ్లకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ, వైద్యులు భారత్ గౌడ్, వెంకటేశ్వర్, ప్రవీణ, వరుణ్, దివ్యజ్యోతి, ఆస్పత్రి సూపర్‌వైజర్ టి. గోపాల్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సబ్ జూనియర్ అథ్లెటిక్స్

రాష్ట్రస్థాయికి 25 మంది క్రీడాకారులు ఎంపిక



అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మెదక్ అర్బన్ మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ 11వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ జిల్లా స్థాయి పోటీలు శనివారం స్థానిక స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి పోటీలను డాక్టర్ మహ్మద్ సూఫీ జెండా ఊపి ప్రారంభించారు. అండర్-8, 10, 12 బాల బాలికలకు రన్స్, త్రో, జంప్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది క్రీడాకారులు వచ్చే నెల జూన్ 1న హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి బిల్లు రాలేదని..

టవరెక్కిన లబ్ధిదారుడు

రాయపోల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి మొదటి విడత బిల్లు రాలేదని ఓ లబ్ధిదారుడు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఈ ఘటన మండలంలోన రామారం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని రామారం గ్రామాన్ని ఇందిరమ్మ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల కింద 183 మందిని లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు 14 మంది బేస్‌మెంట్ లెవల్‌లో నిర్మాణాలు పూర్తి చేశారు. ఇందులో ఐదుగురికి మొదటి విడత డబ్బులు అకౌంట్‌లో పడ్డాయి. అయితే, గ్రామానికి చెందిన తలారి ఉషయ్య కూడా బేస్‌మెంట్ వరకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేశాడు. కానీ, మొదటి విడతలో అతనికి డబ్బులు అందలేదు. దీంతో ఆయన సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. పోలీసులు వచ్చి నచ్చజెప్పగా, రెండు గంటల తర్వాత కిందికి దిగాడు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మాధవిని సంప్రదించగా, ఊషయ్య మొదటగా ఇచ్చిన బ్యాంక్ అకౌంట్ పని చేయకపోవడంతో డబ్బులు జమకాలేదని, తిరిగి కొత్త అకౌంట్ తీయించి, పంపించామని తెలిపారు. త్వరలోనే డబ్బులు జమ అయ్యేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా మాధవి చెప్పారు.



ఎద్దు బండి గిల్ల ఎగిరిపడ్డది..!



పల్లెల్లో కనిపించని ఎడ్లబండ్లు.. వాటి స్థానంలో ట్రాక్టర్లు.. ఆటో ట్రాలీలు

నాడు వ్యవసాయంలో కీలకం.. నేడు తగ్గిన వాడకం

సండే స్పెషల్ Sunday Special

మునిపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి):

ఇల్లు కట్టుకునే ఇటుకల రాయితో..
సెలకల చల్లె ఎరువు కుళ్లుతో..
ఎద్దు బండి ఉన్నొనికి సేతిలో ఏడాదంతా పనిదొరికేది..

కుబుసం సినిమాలోని ఓ పాటలో చరణమిది.. నిజమే పల్లెల్లో గతంలో ఎడ్ల బండి ఉంటే.. వామ్మో ఎడ్ల బండి ఉంది ఆ రైతుకేం అనే వాళ్లు.. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఒకప్పుడు పల్లెల్లో ఎటు చూసినా కనిపించే ఎడ్ల బండ్లు ఇప్పుడు పూర్తిగా కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు వచ్చేశాయి. అక్కడడక్కడ ఇనుప టైర్ల ఎడ్ల బండ్లు కనిపిస్తున్నా.. అవీ నామమాత్రమే.

చేతినిండా పని..

గ్రామాల్లో ఎడ్ల బండ్ల జోరు కొనసాగిన రోజులే వేరని పాతతరం వాళ్లు చెబుతున్నారు. వ్యవసాయానికి ప్రాణంగా ఎడ్ల బండ్లే నిలిచేవి. సీజన్ ప్రారంభం అయ్యిందంటే చాటు వ్యవసాయ పరికరాలు పొలాలకు తీసుకెళ్లేడం మొదలు పెట్టి.. పంటను ఇంటికి చేర్చే వరకు రైతులకు ఎడ్లబండ్లే ఆధారం. తమ వ్యవసాయ పనులకే కాకుండా పొరుగు రైతుల పనులకూ కొందరు కిరాయికి కూడా బండ్లను నడిపేవారు. ఇల్లు కట్టుకునేందుకు ఇసుక, ఇటుక, ఇతరాత్ర తరలించడం వంటి పనులతో ఎడ్ల బండ్లు ఉన్న వారికి చేతినిండా పని ఉండేది. శుభకార్యాలు, జాతరలు వచ్చాయంటే చాలు ఎడ్లకు, బండ్లకు ప్రత్యేక అలంకరణ చేసుకుని మరీ ఇంటిల్లిపాది తరలివెళ్లేవారు. ఎడ్లబండ్లతో రైతులతో పాటు పల్లెల్లో పలువురికి ఉపాధి లభించేంది. వడ్రంగి, కమ్మరులు బండ్ల తయారీలో బిజీగా ఉండేవారు. కొత్త బండ్ల తయారీ, పాతవాటికి మరమ్మతులతో ఉపాధికి అవకాశం ఉండేది.



జాతరల్లో జోరు..

ఉమ్మడి జిల్లాలో జరిగే జాతరల్లో ఎడ్ల బండ్ల ఎక్కువగా కనిపిస్తున్నాయి. జాతరల్లో భాగంగా పలువురు ఎడ్లబండ్లతో ప్రదక్షణలు నిర్వహించేందుకు తమ బండ్లను, ఎడ్లను ప్రత్యేక అలంకరణ చేస్తారు. అందంగా తీర్చిదిద్దిన ఎడ్ల బండల్లో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఇప్పటికీ కొనసాగుతుంది. అలాగే, కొన్ని చోట్ల వ్యవసాయానికి, ఇతర అవసరాలకు కొందరు ఎడ్లబండ్లను వినియోగిస్తున్నా.. వాటికి మర్మమతులు చేసే వారు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి ఎడ్ల బండి చక్రాలకు ఏటా పట్టాలు కట్టాల్సి ఉంటుంది. పిడకల్లో కాల్చి పట్టాలు కట్టేవారు. ఇందుకోసం గతంలో రూ. 500 తీసుకుంటే, ప్రస్తుతం రూ.1200 తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల రూ. 1,600 వరకూ చెల్లించాల్సి వస్తోంది.



ఎడ్ల బండ్ల వాడకం తగ్గింది..

అప్పట్లో వ్యవసాయం చేయాలంటే ఎడ్ల బండ్లు ఉంటాల్సిందే. పొలానికి మందుల సంచులు, ఇతర పరికరాలు తీసుకెళ్లాలంటే ఎడ్లబండ్లలోనే తీసుకెళ్లేవాళ్లం. ఇప్పుడు ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు వచ్చేశాయి. అప్పట్లో రోడ్డు కూడా ఉండేది కాదు. ఎడ్ల బండ్ల మీదే వెళ్లేవాళ్లం. ఇప్పుడు అన్ని మారిపోయాయి. దీంతో ఎడ్ల బండ్లు కనిపించడం లేదు.

గొల్ల విఠల్, రైతు, మల్లికార్జున్‌పల్లి

ఎడ్లూ ఖరీదే..

గతంలో రైతులతో పాటు గ్రామాల్లో పశువుల పెంపకం ఎక్కువగా ఉండేది. రైతులు కచ్చితంగా వ్యవసాయం కోసం ఎడ్లను పోషించే వారు. వ్యవసాయ పనులతో పాటు బండ్లను వాటిని వినియోగించేవారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో అందరూ ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. అదే క్రమంలో పశుపోషణ కూడా తగ్గడంతో గ్రామాల్లో ఎడ్లు తగ్గిపోయాయి. కొనుగోలు చేద్దామన్నా ఖరీదు ఎక్కువ కావడంతో రైతులు వాటికి దూరంగా ఉంటున్నారు. పశుగ్రాసం కొరత కూడా కారణమని అంటున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

కార్మికుడికి ప్రాణగండం

డబ్బు ఆశ చూపి.. కరెంట్ స్తంభంపైకి..
అక్కడి నుంచి పడి వెన్నుకు గాయాలు
ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో బాధితుడు

కంది, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యం ఓ చిరుద్యోగికి ప్రాణ సంకటంగా మారింది. వారు చేయాల్సిన పనిని పంచాయతీ కార్మికుడితో చేయించి.. అతని ప్రాణాలకు ముప్పు తెచ్చారు. డబ్బు ఆశచూపించి విద్యుత్ స్థంభంపైకి ఎక్కించగా, ప్రమాదవశాత్తు జారిపడి అతని వెన్నుపూస విరిగింది. ప్రస్తుతం ఆస్పత్రిలో అతడిని ఆదుకోవాల్సిన వారు కనీసం ఫోన్లు కూడా లిఫ్ట్ చేయకుండా తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కంది గ్రామ పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ప్రకాష్ (30) అరకొర జీతంతో కుటుంబాన్ని నెట్టుకువస్తున్నాడు. విధులు ముగియగానే సాయంత్రం వేళ విదుత్ అధికారులు అతనితో వీధి లైట్లు వేయించడం, ఏదైనా వెంచర్‌లో విద్యుత్ వైరు గుంజడం లాంటి పనులు ఉంటే చేయించేవారు. ఇందుకోసం ప్రకాశ్‌కు



ఎంతో కొంత డబ్బు చెల్లించే వారు. శుక్రవారం సాయంత్రం ఓ వెంచర్లో విద్యుత్ వైర్లు గుంజాల్సి ఉండటంతో లైన్‌మన్, అతని సహచరులు ఈ పనులను ప్రకాశ్‌కు అప్పగించారు. పనుల్లో భాగంగా విద్యుత్ స్థంభం ఎక్కిన ప్రకాశ్ ప్రమాదవశాత్తు జారి పడి వెన్నుపూస విరిగింది. దీంతో విద్యుత్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ప్రకాశ్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రకాశ్ కుటుంబ సభ్యులకు కొన్ని డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అయితే, శనివారం అన్ని పరీక్షలు జరిపిన వైద్యులు ప్రకాశ్ మెడ కింది నుంచి వెన్నుపూసకు శస్త్ర చికిత్స చేయాలని చెప్పారు. ఇందుకు రూ. 8 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో ఆ కుటుంబం దిక్కుతోచకుంది. ఈ విషయాన్ని లైన్‌మన్, అతని సహచరులకు, విద్యుత్ అధికారులకు చెప్పేందుకు ప్రయత్నించగా, ఎవరూ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. దీంతో బాధితుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యాడు.

398 గ్రాముల నల్లమందు పట్టివేత

తూప్రాన్ మే 24 (ఆంధ్రజ్యోతి): నల్లమందు రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని సంబంధిత అధికారులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లమందు(ఓపీఎం)ను తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గాంధీనాయక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అధికారులతో కలిసి సంగారెడ్డి జిల్లాలోని తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద శనివారం తనీఖీలు చేపట్టారు. రాజస్థాన్‌కు చెందిన రాందయాల్ 398 గ్రాముల నల్లముందును తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడి నుంచి మత్తుమందుతోపాటు ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ అనిల్ కుమార్, కానిస్టేబుల్ అలీం, అమాతుల్, సతీష్ మోహన్, రామారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ యాదవరెడ్డి ప్రసంగాన్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

రసాభాసగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎమ్మెల్సీ ప్రసంగాన్ని అడ్డుకున్న కాంగ్రెస్



తూప్రాన్ మే 24 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. మండలంలోని 163 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను శనివారం తహసీల్దార్ టిక్మాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టారని, మొదట్లో రూ. 50 వేలు ఇచ్చి తర్వాత రూ. లక్షకు పెంచారని తెలిపారు. ఇప్పటి పరిస్థితులను బట్టి ఈ పథకాన్ని రూ. లక్షన్నరకు పెంచాలని, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు తులం బంగారం అందజేయాలన్నారు. ఈ సమయంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్సీ ప్రసంగాన్ని అడ్డుకుని, కేసీఆర్ నియోజకవర్గాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని, అప్పట్లో కల్యాణలక్ష్మి చెక్కుల కోసం ఇబ్బందులు పడ్డామని తెలిపారు. కేసీఆర్ జీతం తీసుకుంటూ పనిచేయడం లేదని ఆరోపించారు. అలాగే, కొందరు 'జై కాంగ్రెస్.. జైజై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఎవరూ ఎం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా పోయింది. తహసీల్దార్ కల్పించుకుని వెంటనే చెక్కుల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, మాజీ చైర్మెన్లు గంగుమళ్ల ఎలక్షన్‌రెడ్డి, మడుపు భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

విత్తనాల ఎంపికే కీలకం.. నకిలీలతో జాగ్రత్త



అక్కన్నపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): రోహిణి కార్తె వచ్చేసింది. వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పంట కోసం ఆరుగాలం కష్టపడే రైతులు పంట కాపాడుకనేందుకు మొదటి నుంచే అప్రమత్తంగా ఉండాలి. దుక్కిదున్నింది మొదలు పంట చేతికొచ్చే వరకు సాగుకు సంబంధించి అన్ని జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం వానకాలం సీజన్ కోసం రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇక్కడే రైతులు కీలక అడుగు వేయాలి. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విషయంలో జాగ్రత్తగా ఉంటే మంది దిగుబడి సాధించవచ్చు.


5.17 లక్షల ఎకరాల్లో సాగు

సిద్దిపేట జిల్లాలో 5.17 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేయనున్నారు. వరి 3.75 లక్షలు, పత్తి 1.10 లక్షలు, మొక్కజొన్న 25 వేలు, ఇతర పంటలు 7 వేలు ఎకరాలో సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, మద్దూరు మండలాల్లో 1.06 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయనున్నారు. వరి 68,500, పత్తి 25 వేలు, మొక్కజొన్న 2,700, ఇతర పంటలు 5,700 ఎకరాలో సాగు చేయనున్నట్లు హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్ అధికారి బి. శ్రీనివాస్ తెలిపారు.

అధికారులు అప్రమత్తం

వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తన ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ, పోలీసు అధికారులు తనిఖీలు చేస్తున్నారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ వివరాలు, బిల్ బుక్‌లు, గడువు దాటిన విత్తనాలు, పురుగుల మందులు, బయో ఫర్టిలైజర్‌లతోపాటు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఏవైనా ఉన్నాయా..? లేవా..? అని పరిశీలిస్తున్నారు. అలాగే, గ్రామాల్లోకి వచ్చిన దళారుల వద్ద విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయరాదని రైతులకు సూచిస్తున్నారు. ఎవరైనా దళారులు గ్రామాలకు వచ్చి విక్రయిస్తే పోలీసులకు రైతులు సమాచారం అందించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలి



కొనుగోలు చేసిన విత్తనాల విషయంలో అనుమానం వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు సమయంలో రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రైవేటు కంపెనీల ఆకర్షితమైన ప్రకటనలు చూసి మోసపోవద్దు. విత్తనాల ఖాళీ ప్యాకెట్లు, సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచి ఉంచాలి. విత్తనాలు సరిగ్గా మొలవకపోవడం, పంట దిగుబడి రాక పోవడం లాంటి సమస్యలు వస్తే కంపెనీ నుంచి పరిహారం పొందవచ్చు.

-బి.శ్రీనివాస్, వ్యవసాయ డివిజన్ అధికారి, హుస్నాబాద్

విత్తనాల కొనుగోలులో..

వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీల్ చేసి ఉన్న బస్తాలను ధ్రువీకరణ పత్రం(ట్యాగ్) ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలి. బస్తా, ప్యాకెట్ పై గడువు తేదీ, రకం పేరు, లాట్ నంబర్లను గమనించాలి. కొనుగోలు బిల్లుతో పాటు నంబరు, విత్తన రకం, గడువు తేదీ ఉండేలా డీలర్ సంతకంతో కూడిన రసీదు పొందాలి. రైతు సంతకం కూడా బిల్లుపై ఉండేలా చూసుకోవాలి. ప్రైవేటు విత్తన సంస్థలు పెద్ద ఎత్తున చేసే ప్రచారానికి ఆకర్షితులై విత్తనాలు కొనుగోలు చేయరాదు. విత్తనాలను ఎంచుకునే ముందు వ్యవసాయ అధికారి, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం మంచిది. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తనాలు ఉంటే వాటిని తీసుకోవడం ఉత్తమం.

ఎరువులు కొనేముందు..

ఎరువులను కూడా లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన ఎరువులకు సరైన బిల్లులు పొందాలి. బిల్లులను జాగ్రత్తగా దాచి ఉంచాలి. డీలర్ బుక్‌లో రైతు విధిగా సంతకం చేయాలి. మిషన్ కుట్టు ఉన్న ఎరువుల బస్తాలు మాత్రమే కొనాలి. సీసంతో సీల్ ఉందో లేదో చూసుకోవాలి. బస్తా పై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తిదారుల వివరాలు ఉండాలి. కొనుగోలు చేసిన ఎరువుల విషయంలో అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.

పురుగుల మందుల విషయంలో..

చీడపీడల నివారణకు వాడే క్రిమిసంహారక మందుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వ్యవసాయ శాఖ సూచించే మందులను మాత్రమే కొనాలి. లైసెన్స్ లేని దుకాణాల నుంచి మందులను కొనరాదు. అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటే మందులు చెడిపోతాయి. లేబుల్ లేని మందు సీసా, ప్యాకెట్, డబ్బాలను కొనుగోలు చేయరాదు. లేబుల్ మీద ప్రకటించిన మందు పేరు, రూపం, మందు శాతం, పరిమాణం, విష ప్రభావం తెలిపే గుర్తులు, వాడకంలో సూచనలు, జాగ్రత్తలు, విరుగుడు మందులు, బ్యాచ్ నెంబర్, వాడాల్సిన గడువు, తయారు చేసిన సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ విషయాలు పరిశీలించాలి. అన్ని వివరాలతో కూడిన బిల్లును పొందాలి.

అదును చూస్తే.. అధిక దిగుబడి

దౌల్తాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): అదును చూసి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అలా చేస్తే తెగుళ్లు, చీడపీడల ఉధృతి నుంచి పంటలను కాపాడుకోవడంతో పాటు పంట నాణ్యత పెరుగుతుందని అంటున్నారు.

వరి: దీర్ఘకాలిక వరి రకాలను జూన్ మొదటి వారం నుంచి చివరి వారం వరకు నారు పోసుకోవాలి. పంట కాలం 135 రోజుల నుంచి 150 రోజులు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 20లోపు పంట చేతికి వస్తుంది. మధ్యకాలిక రకాల నారును జూన్ 20 నుంచి జూలై 30లోపు పోసుకోవాలి. పంట కాలం 125 రోజుల నుంచి 135 రోజులు. నవంబర్ 5 నుంచి 25లోపు చేతికి వస్తుంది. నేరుగా పొడి దుక్కులలో వరి సాగు చేసే రైతులు స్వల్పకాలిక, మధ్యకాలిక రకాలను జూన్ 20 నుంచి జూలై 30 వరకు నారు పోసుకోవాలి.

మొక్కజొన్న: వానాకాలంలో మొక్కజొన్న సాగు చేసే రైతులు జూన్ 15 నుంచి జూలై 15 లోపు విత్తుకుంటే అధిక దిగుబడి వస్తుంది. వర్షాపాతం తక్కువ ఉంటే జూలై చివరి వారం వరకు సాగు చేసుకోవచ్చు. వానాకాలం మొక్కజొన్న సాగు చేసేవారు స్వల్పకాలిక రకాలను ఎంచుకుంటే మంచిది. అయితే, దీర్ఘకాలిక రకాలను ఎంచుకుంటే మంచి దిగుబడి వస్తుంది. దీర్ఘకాలిక రకాలు 110 నుంచి 120 రోజుల్లో పూతకు వచ్చి ఎకరాకు సగటున 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. తేలికపాటి భూముల్లో, ఎర్ర చెలుక నెలల్లో మధ్యకాలిక రకాలు ఎంచుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చు.

కాలనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి..



రైతులు పంటలను కాలానికి అనుగుణంగా ఎంచుకోవాలి. ఏ పంటలను ఎప్పుడు సాగు చేయాలనే అంశంపై పూర్తి అవగాహన ఉండాలి. దీంతో మంచి దిగుబడులు సాధించడమే కాకుండా తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉంటుంది.

- సంతోష్, ఏఈవో, గాజులపల్లి, దొమ్మాట, సూరంపల్లి, లింగరాజుపల్లి క్లస్టర్

నారాయణఖేడ్‌కు మహర్దశ

● రూ.1.28 కోట్లతో ప్రధాన కూడళ్ల సుందరీకరణ పనులు ● ఇప్పటికే సీసీరోడ్లు, మురుగు కాలువల పనులు పూర్తి


ఖేడ్‌లో నిర్మించిన సీసీరోడ్లు


సుందీకరణ పనులు చేపట్టనున్న ప్రధాన కూడళ్లు

నారాయణఖేడ్, మే 24 (ఆంధ్రజ్యోతి) : నారాయణ ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో టీయూఎ్‌ఫఐడీసీ నిధులతో మెజార్టీ వార్డులలో రూ.20 కోట్లతో సీసీరోడ్లు, మురుగు కాల్వలు నిర్మించడంతో పట్టణ రూపురేఖలు మారాయి. గత ప్రభుత్వం హయాంలో మేజర్ గ్రామప ంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మార్చిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టణాభివృద్ధికి కేటాయించిన నిధులతో సీసీరోడ్లు, మురుగు కాలువలకు తోడు ప్రస్తుతం.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభి వృద్ధి పనులతోపాటు మెజార్టీ వార్డుల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. కొత్త మున్సిపాలిటీ అయినా పన్నుల వసూళ్లలో అగ్రగామిగా నిలువడంతో ప్రభుత్వం ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపిక చేసి, పట్టణంలోని ప్రధాన కూడళ్ల ఆధునీకర ణకు రూ.1.28 కోట్ల నిధులను సీడీఎంఏ పథకం కింద మంజూరు చేసింది. పట్టణం రోజురోజుకు విస్తరించడా నికి తోడు నూతన కాలనీలు వెలుస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాదాపు 15 కిలోమీటర్ల మేర సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు పూర్త య్యాయి. వందశాతం సీసీరోడ్ల నిర్మాణం పనులు పూర్తి కావాలంటే మరో రూ.20 కోట్లు అవసరమని అధికా రులు తెలుపుతున్నారు. సుందీకరణకు నిధులు మంజూరు కావడంతో పట్టణంలో ఎప్పుడూ రద్దీగా ఉండే రాజీవ్ చౌక్, బసవేశ్వర్ చౌక్, గాంధీచౌక్, అంబే ద్కర్‌చౌక్, సేవాలాల్ చౌక్, శివాజీ చౌకల ప్రాంతాల్లో చుట్టూ సర్కిల్స్ నిర్మాణం చేసి, గ్రీనరీలకు తోడు ఫౌంటే న్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందిం చారు. రాజీవ్ చౌక్‌ను సెంటర్‌లోకి మార్చి వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉండేవిధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. రాజీవ్ చౌక్ పట్టణానికి ప్రధాన చౌక్ కావడంతో గ్రీనరీ, గ్రిల్స్ ఏర్పాటు చేయను న్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన పనులకు టెండర్లు కూడా పిలువనున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా పనులు పూర్తయితే పట్టణం మరింత శోభాయమా నంగా మారనున్నది.

కూడళ్లను సుందరీకరిస్తాం

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.1.28 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో సుందీకరణ పనులను స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్‌షెట్కార్ సహ కారంతో చేయిస్తాం. ఇప్పటికే టీయూఎ్‌ఫఐడీసీ పథకం ద్వారా రూ.20 కోట్లు మంజూరు కావ డంతో అధికశాతం వార్డుల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వలను నిర్మించాం.

- జగ్జీవన్, మున్సిపల్ కమిషనర్

లబ్ధిదారుల ఎంపిక త్వరగా చేపట్టండి : ఎమ్మెల్యే


ఖేడ్ ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ, రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో నియో జకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన పేదలను ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలకు ఎంపిక చేసి త్వరగా ప్రొసీడింగ్ పత్రాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఆయా మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు. అలాగే కల్హేర్ మండలానికి చెందిన గుర్రపు భాగ్యల క్ష్మికి మంజూరైన రూ.56 వేల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే తన స్వగృహంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్య క్షుడు రమేష్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో తీగలవంతెన ఏర్పాటుపై అధ్యయనం


రాయసముద్రం పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

రామచంద్రాపురం టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో దుర్గం చెరువు తరహాలో తీగ వంతెన ఏర్పాటుపై అధికారుల బృందం అధ్య యనం చేస్తుందని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి రామచంద్రారెడ్డినగర్ రాయసముద్రం చెరువు పరీవాహక ప్రాంతాన్ని హెచ్ఎండీఏ, నీటిపారుదల, జీహెచ్ఎంసీ శాఖల అధికారుల బృందం సందర్శిం చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైటెక్ సిటీ దుర్గం చెరువు పైభాగంలో నిర్మించిన తీగ వంతెన తరహాలో నిర్మాణం చేపట్టడానికి సాధ్యాసా ధ్యాలపై అధ్యయనం చేస్తున్నారని వివరించారు. పర్యాటకశాఖ అధికారులు ప్రత్యక్ష పరిశీలన చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు నళిని, ఏఈ పావని, హెచ్ఎండీఏ డీఈ జగన్మోహన్, ఏఈ రంజిత్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రామచంద్రాపురం డివిజన్ పపరిధి రామచంద్రారెడ్డినగర్ కాలనీలో ఎంటమాలజీ విభాగం అధికారులు ఫాగింగ్ చేసే పనులను కార్పొరేటర్ పుష్పానగేష్ పరిశీలించారు.

స్వర్ణకారులు సంఘటితంగా ముందుకు సాగాలి

మెదక్ అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణకా రులు సంఘటితంగా ముందుకు సాగాలని స్వర్ణ కార సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు పూన రవి చారి పిలుపునిచ్చారు. స్థానిక ఓ గార్డెన్‌లో పట్టణ స్వర్ణకార సంఘం వయోజన, యువజన, శ్రీ కాళికా దేవి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకరోత్సవా నికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడుతూ... కార్పొరేట్ కబంధ హస్తాల్లో వృత్తిపై ఆధారపడి జీవి స్తున్న స్వర్ణకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అనేక చోట్ల స్వర్ణకారులు కుటుంబ సభ్యులతో మూకుమ్మడి ఆత్మహత్యలే ఇందుకు నిద ర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద స్వర్ణకా రులను, విశ్వకర్మలను ఆదుకోవాలని కోరారు. విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం పట్టణ వయోజన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్రహ్మచారి, ప్రధాన కార్యదర్శిగా వేణుచారి, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జగ్గన్నగారి బ్రహ్మచారి, మహేష్‌చారి, యువజన విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రవీంద్రచారి, నరేష్‌చారి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, రామాయంపేట, కామారెడ్డి అధ్యక్షుడు రామకృష్ణ, చక్రంచారి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి : జడ్జి హేమలత


కోర్టు పరిధిలోని ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్జి హేమలత

నర్సాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ఆయా మండలాల్లోని అధికారులు చొరవ తీసుకోవాలని నర్సా పూర్ సివిల్ జడ్జి హేమలత పేర్కొన్నారు. శనివారం నర్సా పూర్ కోర్టు పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవ సాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ప్రాముఖ్యతను అధికారులకు వివరించారు. కోర్టు పరి ధిలోని నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, చిలప్‌చెడ్ మండ లాల గ్రామీణ ప్రాంత ప్రజలు పలు రకాల సమస్యలతో మండల లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా కోర్టును ఆశ్రయిస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూప, మధుశ్రీ, తహసీల్దార్లు శ్రీనివాస్, ఆంజనేయులు, సహదేవ్, ఎంపీడీవోలు కిలం, ఆనంద్, సూపరిండెంట్లు రామోహ్మన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతు న్నాయి. మూడోరోజు శనివారం గణితం, బొటనీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టు పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 28 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫస్టియర్ పరీక్షకు 2,283 మందికి 2,170 మంది హాజరుకాగా, 113 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షకు 8,431 మందికి 8,035 మంది రాగా, 396 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు.

బక్రీద్ పేరుతో గోహత్యలను ఆపాలి

మెదక్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పేరుతో గోహత్యలను అరికట్టాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్‌తోపాటు డీఎస్పీ, పట్టణ సీఐలను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, గోవుల అక్రమ రవాణాను అడ్డు కోవాని, అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాల న్నారు. గోహత్య చట్టాలను అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బబ్లు, అసెంబ్లీ కన్వీనర్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్, ప్రశాం త్, జిల్లా అధికార ప్రతినిధి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై జనుము, జీలగ విత్తనాలు


రైతులకు విత్తనాలు అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి

రామచంద్రాపురం/గుమ్మడిదల/శివ్వంపేట// మే 24 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలంలోని రైతులకు తెల్లాపూర్‌లో 50 శాతం సబ్సిడీపై జనుము, జీలగ విత్తనా లను సొసైటీ ద్వారా అందజేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి తెలిపారు. శనివారం పలువురు రైతులకు విత్త నాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచార కులు మనోహర్, వ్యవసాయ అధికారి ప్రసాద్, విస్తరణ అధికారి రాణి, మాజీ సర్పంచ్ యాదయ్య, డైరెక్టర్లు రాజ్‌కు మార్, లక్ష్మణ్, మోహన్‌రెడ్డి, పంతులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం సొసైటీ భవనంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి మండల వ్యవసాయ అధికారి శ్రీనివా సరావుతో కలిసి జీలుగ విత్తనాలను అందజేశారు. మే చివరి వరకు అన్ని మండలాల్లోని రైతులకు జీలుగ విత్త నాలు అందేలా కలెక్టర్ ఆదేశాలు జారీచేయాలని రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య కోరారు. శనివారం శివ్వంపేటలో మాట్లాడారు.

అంధకారంలో జిన్నారం మండల కేంద్రం

● ప్రత్యేక పాలనలో వెలగని వీధిదీపాలు


జిన్నారం అంబేద్కర్ వద్ద వీధిలైట్లు లేక నెలకొన్న అంధకారం

జిన్నారం, మే 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మండల కేంద్రం జిన్నారంలో రాత్రివేళ విద్యుత్ వెలుగులు లేక చిమ్మ చీకట్లు అలుముకుం టున్నాయి. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో గతంలో ఉన్న హైమాస్ట్ లైట్లు పూర్తిగా పనిచేయకపోవడం, వాటి స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయలేదు. జిన్నారం నుంచి నర్రిగూడ, పెద్దమ్మగూడెం రహదా రిలో గతంలో ఉన్న వీధిలైట్లు కూడా పనిచేయడం లేదు. ఊట్ల రోడ్డులో అసలు విద్యుత్‌దీపాల లైను లేక చీకట్లు నెలకొన్నాయి. రాత్రివేళ దారి కనిపించక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి అంబేద్కర్ చౌరస్తా, తహసీ ల్దార్ కార్యాలయం, నర్రిగూడ, పెద్దమ్మగూడెం రోడ్డులో లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కల్హేర్/నాగల్‌గిద్ద/చేగుంట/చిలప్‌చెడ్/వెల్దుర్తి/జి న్నారం మే 24 (ఆంధ్రజ్యోతి) : విద్యాబోధనలో ఉపాధ్యాయులు మరింత రాణించేందుకు ఐదురో జుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగి సింది. కల్హేర్‌లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల, సిర్గాపూర్‌లో కేజీబీవీలో నిర్వహించిన ముగిం పులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాబోధనలో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ వెళ్తేనే పోటీలో నిలుపగలుగుతామని అన్నారు. అలాగే నాగల్‌గిద్ద జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదురోజులుగా నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఎంఈవో మన్మథకిశోర్ హాజరై మాట్లాడారు. చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపా ధ్యాయులకు నిర్వహించిన శిక్షణ ముగిసింది. ఎంఈవో నీరజ పాల్గొని మాట్లాడారు. చిలప్‌చెడ్ మండలంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో విఠల్, సీఆ ర్పీలు మల్లేశం, రాజశేఖర్ పాల్గొన్నారు. వెల్దుర్తి, జిన్నారం మండలాల్లో ఉపాధ్యాయులకు ఐదురో జుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగి సింది. ఈ సందర్భంగా వెల్దుర్తి ఎంఈవో యాదగిరి, జిన్నారం ఎంఈవో కుమారస్వామి, సీఐ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కుర్తివాడ అనాథలకు ఆర్థిక సహాయం

పాపన్నపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట మండలంలోని కుర్తివాడ అనాథలకు సహాయం చేయరూ... అన్న కథనానికి పీఆర్టీయూ టీచర్లు స్పందించారు. శనివారం కుర్తివాడలోని పిల్లలు లావణ్య, అనురాధ, నవీన్ వద్దకు వెళ్లి రూ.26 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రాజు, కార్యదర్శి నురేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అంజ నాచారి, ఉపాధ్యక్షులు రవీంద్రారెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా అమ్మల నవీన్



పుల్‌కల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పుల్కల్ మండల అధ్యక్షుడిగా అమ్మల నవీన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు సీ.గోదావరిఅంజిరెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీచేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్సీ సీ.అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సీ.గోదావరి, మాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమాలను వెలికితీసేందుకు మానవహక్కుల సంఘం కృషి

జహీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమాలను వెలికితీసేందుకే మానవహ క్కుల సంఘం కృషి చేస్తున్నదని జిల్లా అధ్యక్షుడు వినయ్‌పవార్ పేర్కొన్నారు. శని వారం జహీరాబాద్ పట్టణంలో నిర్వహిం చిన మానవ హక్కుల సంఘం సమావే శంలో మాట్లాడారు. నిరుపేదలకు న్యాయం జరిగేవిధంగా కృషిచేస్తూ, అక్రమాలపై రాజీ లేని పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కుని నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల సంఘం నాయకులు వీరేందర్, రాజనర్సింలు, సుమ న్ సురేష్‌స్వామి, న్యాయవాది మాణిక్‌పా టిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

జహీరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23న జహీరాబాద్ పట్టణంలో చేప ట్టిన సీఎం పర్యటనతో ప్రజలకు ఒరిగిం దేమి లేదని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సీఎం జహీరాబాద్‌కు రావడం వల్ల ఏవేవో అద్భు తాలు జరుగుతాయని ప్రజలు, నాయకులు ఊహించారన్నారు. నియోజకవర్గ అభివృ ద్ధికి వరాలజల్లు లేకపోవడంతో సీఎం పర్య టన తీరుపై అసహనం వ్యక్తంచేశారు. ఏదే మైనా సీఎం పర్యటన మాత్రం ప్రజల్లో నిరుత్సాహాన్ని నింపిందని ఆరోపించారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం వద్దు

అల్లాదుర్గం, మే 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా త్వరగా కొనుగోలు చేయాలని అల్లాదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షుడు కంచరి బ్రహ్మం ఆధ్వ ర్యంలో రైతులు శనివారం తహసీల్దార్ మల్లయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

పాపన్నపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఏవో నాగ మాధురి హెచ్చరించారు. శనివారం పాప న్నపేటలో విత్తన, ఎరువుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహిం చారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పకుండా రసీదు ఇవ్వాలన్నారు.

మోడల్ పాఠశాలకు 11 మంది ఎంపిక

నర్సాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జక్కపల్లిలో ఉన్న మోడల్ స్కూల్‌కు చిప్పల్‌తుర్తి ఎంపీయూపీఎస్ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో తారాసింగ్, హెచ్ఎం రవికుమార్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చిప్పల్‌తుర్తి పాఠశాలకు చెందిన వడ్ల ప్రణవి రాష్ట్రస్థా యిలో 19వ ర్యాంకు సాధించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఒకే పాఠశాలకు చెందిన 11 మంది మోడల్ స్కూల్‌కు ఎంపిక కావడం పట్ల ఎంఈవో, ఉపాధ్యాయులను అభినందించారు.

కస్తూర్బా పాఠశాల కోసం భవనం పరిశీలన

వట్‌పల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వట్‌పల్లిలో కస్తూర్బా పాఠశాల ఏర్పాటు కోసం ఓ ప్రైవేటు భవ నాన్ని శనివారం డీఈవో వెంకటేశ్వర్లు పరిశీ లించారు. అంతకుముందు ఐదు రోజుల పాటు నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్ష ణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయా లను పాఠశాలల్లో అమలుచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటేశం ఎంఈవో గోవిందరెడ్డి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో


రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

మెదక్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన అకాల వర్షా లతో మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మెదక్-కొల్చారం వెళ్లే ప్రధాన రహదారిపై మెదక్ మండల పరిధిలోని పెద్దబాయితండాకు చెందిన రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో ఇరువైపులా చాలాసేపు వరకు వాహనాలు నిలిచిపోయాయి.

ధాన్యానికి మొలకలు.. అన్నదాతకు దిగులు


అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యం సంచులు

చిలప్‌చెడ్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం ధాన్యాన్ని ఆగం చేస్తే వడ్లు పోక, లారీలు రాక ప్రభుత్వం అన్నదాతను ఆగం చేస్తున్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. చండూరు గ్రామానికి చెందిన బేతయ్య అనే రైతు ధాన్యం తూకం వేసి వారంరోజులు గడుస్తున్నా లారీలు రాకపో వడంతో బస్తాల్లో మొలకలు వచ్చాయి. శనివారం మళ్లీ ధాన్యాన్ని ఎండబో సినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. వానాకాలం సమీపిస్తున్నా.. ఎక్కడి ధాన్యం అక్కడే ఉన్నదని, ఎప్పుడు కొంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

నేలతల్లిని కాపాడుకుంటే పంటల దిగుబడి


కోనాయపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేతలు

మనోహరాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు నేలతల్లిని కాపాడుకు న్నప్పుడే పంటల దిగుబడి పెరుగుతుందని జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేతలు అన్నారు. మనోహరాబాద్ మండలం కోనాయ పల్లి పిటి, పోతారం, కూచారం గ్రామాల్లో రైతు ముంగిట శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు ఎరువుల వాడకం తగ్గించుకోవాలని, పంటల మార్పిడి చేయాలని, నేల తల్లిని కాపాడుకున్నప్పుడే పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యకరమంలో శాస్త్రవేతలు కృపారాణి, ఏవో స్రవంతి, ఏఈవోలు నరేందర్‌గౌడ్, కార్యదర్శులు స్వామి, వేణుగోపాల్, రైతులు గణేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడపండి

● డయల్ యువర్ ఆర్డీసీ డీఎంలో విజ్ఞప్తులు

సంగారెడ్డి అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతా లకు అదనపు బస్సులు నడపాలని పలువురు ప్రయాణికులు ఆర్టీసీ డీఎం ఉపేందర్‌ను కోరారు. డయల్ యువర్ సంగారెడ్డి ఆర్టీసీ డీఎం కార్యక్ర మాన్ని శనివారం నిర్వహించారు. కంది డబుల్ బెడ్‌రూమ్ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని వీరన్నచారి, ప్రశాంత్‌రెడ్డి కోరారు. జోగిపేట నుంచి పోచారంకు స్కూల్ టైంకు కాకుండా ఉదయం, సాయంత్ర సమయాల్లో బస్సులు నడపాలని బాలయ్య విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు నుంచి సంగా రెడ్డికి రాత్రి 11 గంటలకు లాస్ట్‌బస్సు నడపాలని సంగారెడ్డి నుంచి జ్ఞానే శ్వర్ కోరారు. ఇవే కాకుండా మరో ఏడు విజ్ఞప్తులు వచ్చాయి.

ఘనంగా తిరంగా ప్రదర్శన


జహీరాబాద్‌లో జెండాను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

జహీరాబాద్/చిన్నశంకరంపేట/అల్లాదుర్గం, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసినందుకుగాను త్రివిధ దళాలకు మద్దతుగా శనివారం జహీరాబాద్ పట్టణంలో ఉపాధ్యాయులు శిక్షణలో భాగంగా జాతీయజెండాను ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ ఉపా ధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. పహల్గామ్ ఘటనలో మృతిచెందిన, ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని చిన్నశంకరంపేటలో ఎంఈవో పుష్పవేణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని అల్లాదుర్గం మండలంలో బీజేపీ నాయకులు తిరంగా యాత్ర నిర్వహించారు.

బాసర ఆలయ ప్రధానార్చకుడిపై దాడి దారుణం

జోగిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా బాసర పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జ్ఞాన సరస్వతీ ఆలయ అర్చకుడు సంజీవ్ పూజారిపై నూక రామారావు అనే వ్యక్తి దాడి చేయడం దారుణమని బ్రాహ్మణ సేవా సంఘం (టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయవాడ భాస్కర్‌దేశ్ పాండే, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజశేఖర్ కులకర్ణి, సంగారెడ్డి, పటా న్‌చెరు మండలాల అధ్యక్షుడు రవిశంకర్‌కుమార్, వాసుదేవరావు, మహిళా సంఘం అధ్యక్షురాలు శిరీష అశోక్, జిల్లా మాజీ పీఆర్వో శ్యామ్ రావు పట్వారీలు అన్నారు. శనివారం వారు జోగిపేటలో విలేకరులతో మాట్లాడారు. పథకం ప్రకారం జరిపిన ఈ దాడి హిందూ ధర్మంపై దాడి గానే పరిగణించాల్సి వస్తోందన్నారు. దాడికి పాల్పడ్డ రామారావు తదితరు లపై కేసులు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు రుణాలతో అభివృద్ధి

● జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్

వెల్దుర్తి/మెదక్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ద్వారా రుణాలు పొంది పెట్టుబడి పెట్టి వ్యాపారంతో మహిళలు ఆర్థికంగా అభి వృద్ధి చెందాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ సూచించారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఐకేపీ కార్యాలయంలో నూతన మండల సమైక్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా కొండపల్లి రూప, కార్యదర్శి చర్లసోని, కోశాధికారిగా గోగుల భాగ్యారాణిను ఎన్నుకు న్నారు. అలాగే మెదక్ మండలంలోని మహిళా సమాఖ్య భవనంలో శని వారం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాఖ్య అధ్యక్షురాలిగా మెగావత్ జ్యోతి (మక్త భూపతిపూర్), కార్యదర్శిగా ఆకుల లావణ్య(తిమ్మ క్కపల్లి), కోశాధికారిగా ఏర్పుల రేణుక(మంబోజిపల్లి)ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా వెంకటస్వామి, ఇందిర వ్యవహరించారు.